క్లుప్తంగా

పలు దుకాణాల్లో చోరీ

నూతనకల్ : గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నడిగూడెం మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. మండల కేంద్రంలోని ఏటూజెడ్ కిరాణ దుకాణం ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని, ఏవీఎం మొబైల్స్ దుకాణం, ఏ 1 కిరాణ దుకాణం, నెంబర్ 1 కిరాణ దుకాణంతో పాటు వెంకటేశ్వర వైన్స్ పక్కన గల ఫుడ్ సెక్షన్‌కు చెందిన దుకాణం, మధు మిత్ర ఆస్పత్రి షెట్టర్ తాళాలను పగుల గొట్టి చోరీకి పాల్పడ్డారు. సంఘటన స్థలాన్ని తుంగతుర్తి సీఐ బ్రహ్మమురారి సందర్శించి క్లూస్ టీమ్ ద్వారా వేలిముద్రలను సేకరించారు. బాధిత దుకాణదారుడు షేక్ తాజీద్ బాబా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో ప్రథమ స్థానం


గొడుగు శ్రీజ

తిరుమలగిరి: అనంతారం మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న గొడుగు శ్రీజకు సదిషా ఫౌండేషన్ నిర్వహించిన మ్యాథ్స్ టెస్టులో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం వచ్చిందని పాఠశాల ప్రిన్సిపాల్ వేముల బాలరాజు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీజను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మ్యాథ్స్ అధ్యాపకులు సీహెచ్.రాధ, వీఎల్ఎన్.చారి, బి.మధు పాల్గొన్నారు.

రైతులు దేశానికి వెన్నెముక


రైతులను సన్మానిస్తున్న సర్పంచ్ పీరమ్మ, హోప్ స్వచ్ఛంద సేవా సమితి ప్రతినిధులు

అర్వపల్లి : రైతులు దేశానికి వెన్నెముక లాంటి వారని రామన్నగూడెం సర్పంచ్ రమావత్ పీరమ్మ, హోప్ స్వచ్ఛంద సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దైద వెంకన్న అన్నారు. జాతీయ రైతు దినోత్సవాన్ని శనివారం రామన్నగూడెంలోని రైతు వేదిక భవనంలో హోప్ స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు బంటు యాదగిరి, గుండె ఈశ్వర్, జడ సత్తయ్యలకు సర్టిఫికెట్‌లను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హోప్ స్వచ్ఛంద సేవాసమితి మండల కోఆర్డినేటర్ దడిపల్లి వెంకట్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

నూతనకల్ : మండల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారు మడులను పరిశీలించారు. సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీబాబు, ఏఈఓ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

చెవిటి వెంకన్న యాదవ్‌కు ఎంపీ టికెట్ కేటాయించాలి


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి నాయకులు

నాగారం : కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భువనగిరి పార్లమెంట్ టికెట్‌ను చెవిటి వెంకన్నయాదవ్‌కు కేటాయించాలని బీసీ విద్యార్థి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పసుల అశోక్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని రహదారిబంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ ప్రజా సమస్యలపై దశాబ్దాల కాలంగా పోరాడుతున్నాడని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వల్లాల భానుప్రకాశ్, కొలిపాక సాయికుమార్, షేక్ అక్బర్‌పాష, కన్నెబోయిన లింగమల్లు, కన్నెబోయిన రాజు, ఉమేష్, గంట నవీన్, మల్లేష్, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి


నాగారం ప్రాథమిక పాఠశాలలో బోధనను పరిశీలిస్తున్న మండల నోడల్ అధికారి

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని మండల నోడల్ అధికారి వాసం ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంలో భాగంగా తరగతి బోధనను పరిశీలించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్ల భాష, గణిత సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం అన్ని తరగతుల వర్క్ షీట్స్, ఫార్మేటివ్ అసెస్మెంట్, సమ్మేటివ్, ఎఫ్ఎల్ఎన్ పరీక్ష పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వర్దెల్లి మల్లయ్య, ఉపాధ్యాయులు బి.వెంకట మల్లు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



సూర్యాపేట : వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు, స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు


కోర్కెల చీటీలు రాస్తున్న భక్తులు

భానుపురి : వైకుంఠ ఏకాదశి వేడుకలను శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వైష్ణవ దేవాలయాల్లో స్వామి అమ్మవార్లు ఉత్తర ద్వార దర్శనం ఇవ్వడంతో భక్తులు బారులుదీరారు. ప్రధానంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి కాలయంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. దేవాలయ నిర్వాహకులు ఆలయంలోని పశ్చిమ భాగంలో ఉన్న ఉద్యాన క్షేత్రంలో ప్రత్యేక వైకుంఠ మండపాన్ని ఏర్పాటు చేశారు. ఈ మండపంలో భూదేవి గోదా సమేత శ్రీనివాసుడు కొలువు తీరగా ఉత్తర ద్వారం నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆండాళ్ గోష్టి భక్తబృందం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మాజీ మంత్రి ఆర్డీఆర్ పూజలు..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు వేణుగోపాల స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఇచ్చిన స్వామి వారిని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వేణుగోపాలస్వామి, సంతోషి మాత దేవాలయాల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

తిరుమలగిరి : ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలగిరి మండల కేంద్రంలోని గోదా పద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గొట్టిపర్తి వెంకటేశ్వరరావు, దేవాలయ అర్చకులు రఘువర్ధన్, సూర్యాపేట ఆర్డీఓ వీరభద్రాచారి, తహసీల్దార్ రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


సూర్యాపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి


వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ


వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. కాగా ఆలయంలో విశేష పూజలు, సహస్ర నామార్చన, తులసీ అర్చన జరిపారు. స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఉంచి రథంలో గ్రామంలోని వీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్తర ద్వార దర్శన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈఓ వై. శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాసరెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, యోగానందదీక్షిత్, చక్రవర్తి, యోగానంద భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

అర్వపల్లి ఆలయంలో ఎంపీపీ పూజలు

అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని శనివారం ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యాయాదవ్ దంపతులు సందర్శించారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్‌లు వారిని సన్మానించారు.

తుంగతుర్తి: మండలకేంద్రంలోని శ్రీపట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను శనివారం భక్తులు ఘనంగా జ రుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం, తిరుప్పావై సేవాకాలం, అష్టోత్తర శత నామార్చన, భగవద్గీత పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆరగింపు మంగళశాసనం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ముక్కోటి ఏకాదశి కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధకిషన్‌రావు రూ.10,000 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కాటూరి రామాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో..

చివ్వెంల : మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉండ్రుగొండ గ్రామ శివారులోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామి వారికి ఉత్తర ద్వార దర్శనం, లక్ష తులసీదళార్చన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. వైదమంత్రాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బంధకవి క్రిష్ణమోహన్, మిట్టకోల మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం వైకుంఠ ఏకదశి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని ఆలయంలో..


చివ్వెంల : ఉండ్రుగొండలోని ఆలయంలో..


తుంగతుర్తిలోని రామాలయంలో..


తిరుమలగిరిలో పూజలు చేస్తున్న భక్తులు

ఆలయ అభివృద్ధికి విరాళం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో దాతల సహకారంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే సుమారు రూ.30 లక్షలతో రాజగోపురం, కల్యాణ మండపం, ఇతర పనులు చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో దాతలు స్పందిస్తున్నారు. గ్రామానికి చెందిన మీలా యాగయ్య–మాధవి దంపతులు, మీలా యుగేందర్–నర్మద దంపతులు రూ. 1,00016, తిరునగరి పద్మనాభస్వామి–రమావతి దంపతులు రూ.32వేలు, కాటబత్తిని శ్రీను–విజయరాణి దంపతులు రూ.5,016 చొప్పున శనివారం ఆలయ అభివృద్ధికి విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి భక్తమండలి సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి వ్యక్తికి గాయాలు

మద్దిరాల : తాటి చెట్టు పైనుంచి వ్యక్తికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని చందుపట్లలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన ఆకుల మలయ్య రోజూ మాదిరిగానే తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు కాగా సూర్యాపేటలోని ఆస్పత్రికి తరలించారు.

కంప్యూటర్ బహూకరణ


కంప్యూటర్‌ను బహూకరిస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శాఖా గ్రంథాలయానికి శనివారం కంప్యూటర్‌ను బహూకరించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యాలయ అధికారి శ్రీధర్‌రావు దేశ్‌పాండే ఆర్థిక సాయంతో గ్రామస్తులు కర్నాటి రంగయ్య, సుతారపు సోమశేఖర్‌ల ఆధ్వర్యంలో కంప్యూటర్‌ను లైబ్రేరియన్ దార శ్రీనివాస్‌కు అందజేశారు. గ్రామస్తుల కోరిక మేరకు కంప్యూటర్‌ను బహూకరించినట్లు శ్రీధర్‌రావు తెలిపారు. విద్యార్థులు, పాఠకులు ఈ కంప్యూటర్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుతారపు పిచ్చయ్య, కుంభం సోమయ్య, బింగి కృష్ణమూర్తి, బండారి నవీన్, రింగు నరహరి, నర్సింగ విజయ్, పి.వీరేష్, సీహెచ్. పరమేష్, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని పండుగలకు సమాన ప్రాధాన్యం

తిరుమలగిరి : అన్ని పండుగలకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. శనివారం తుంగతుర్తి నియోజకవర్గ క్రిస్టియన్లకు ప్రేమ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వెయ్యి మందికి క్రిస్మస్ గిఫ్ట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచ శాంతి కోసం పుట్టిన మహనీయుడు ఏసుక్రీస్తు అని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో అందరూ పయనించాలని, శాంతి మార్గంలో ప్రేమను పంచాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అందరికీ అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వీరబ్రహ్మచారి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, తహసీల్దార్ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్, బాబురావు, డానియల్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వినతి

దళిత బంధు పథకంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి తమకు రావాల్సిన డబ్బులను ఇప్పించాలని బండ్లపల్లి గ్రామానికి చెందిన దళిత బంధు లబ్ధిదారులు శనివారం తిరుమలగిరిలో ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దళిత బంధు దరఖాస్తులను కిరాణం షాపు యూనిట్లుగా మార్చారని తెలిపారు. కిరాణం షాపు యూనిట్ వెండర్ రూ.9.90 లక్షల చెక్కు తీసుకొని మాకు కేవలం రూ.7.30 లక్షలు మాత్రమే ఇచ్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా డబ్బులు ఇవ్వమంటే ఏమి చేసుకుంటారో చేసుకోండని అంటున్నారని అన్నారు. దళిత బంధులో జరిగిన అవినీతిపై పూర్తి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ అధికారులను పిలిచి దళిత బంధులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కోక సరిత, మరియమ్మ, నాగలక్ష్మి, యాదమ్మ, మున్ని, రేణుక, పద్మ, శిరీష పాల్గొన్నారు.


తిరుమలగిరిలో క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

పాఠశాలల్లో ఘనంగా 'సెమీ క్రిస్మస్'


సూర్యాపేట టౌన్ : వివిధ వేషధారణల్లో జయ స్కూల్ విద్యార్థులు


తుంగతుర్తిలోని డీఆర్‌ఆర్‌ఎం పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో శనివారం విద్యార్థులు సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ మాత, దేవదూతలు, గొర్రెల కాపరులు, శాంతాక్లాజ్ తాతయ్య వేషధారణలతో అలరించారు. ఏసు ప్రభువు పుట్టుకను తెలిపే నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని డీఆర్‌ఆర్‌ఎం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్‌చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు వివిధ వేషధారణలు ధరించి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వర్దెల్లి శ్రీకాంత్, రేణుక, మమత, స్వాతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండలంలో ఆయా గ్రామాల పాఠశాలల్లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని లిటిల్ బడ్స్ పాఠశాలలో కేక్ కట్‌చేసి సెమీ క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు వివిధ వేషధారణల్లో అలరించారు.


ఆత్మకూరులో పట్టిన మంచు



మంచు దుప్పటి..!

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల వ్యాప్తంగా శనివారం మంచు దుప్పటి కమ్ముకుంది. ఈ శీతాకాలంలో మొదటి సారిగా భారీ ఎత్తున మంచుపట్టింది. అర్ధరాత్రి నుంచే మంచు పట్టి దాదాపు ఉదయం 8గంటల వరకు వీడలేదు. దీంతో ఉదయం వేళ ఎదురుగా వచ్చే వాహనాలు ఏ మాత్రం కన్పించకపోవడంతో వాహనదారులు కాస్త ఇబ్బంది పడ్డారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

● సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

పెన్‌పహాడ్ : పదవులు ఎవరికి శాశ్వతం కాదని, అభివృద్ధి ఎంత చేశామనేదే ముఖ్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు పని చేయాలన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామాల్లో జరగాల్సిన పనులపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. మండలంలోని గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పనులు పూర్తి చేయకుండానే అధికారులు కాంట్రాక్టర్‌లకు బిల్లులు ఎందుకు చేశారని ఎంపీపీ నెమ్మాది భిక్షం మిషన్ భగీరథ ఏఈని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనిత, వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు నాతాల జానకిరాం రెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, తహసీల్దార్ మహేందర్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

పేటలో అభివృద్ధి ముసుగులో అవినీతి


సూర్యాపేటలోని సమీకృత మార్కెట్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న దామోదర్ రెడ్డి

భానుపురి : సూర్యాపేట నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అభివృద్ధి ముసుగులో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్మించిన వెజ్ నాన్ వెజ్ సమీకృత మార్కెట్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం కూరగాయల వ్యాపారస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన ఈ భవనంతో తమకు ఎలాంటి ప్రయోజనం లేదని వ్యాపారులు తెలిపారు. ఈ భవనంలో వ్యాపారాలు సాగడం లేదని ఆర్డీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం దామోదర్ రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆడంబరానికి పోయి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని అన్నారు. కూరగాయల వ్యాపారులకు అనుకూలంగా లేని నిర్మాణాలను చేపట్టారని తెలిపారు. ఆయన వెంట స్థానిక కౌన్సిలర్ వెలుగు వెంకన్న, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, చంచల శ్రీనివాస్, నాగుల వాసు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పులు చేసి అద్భుతమని ప్రచారం

భానుపురి : తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో లక్షల కోట్ల అప్పులు చేసి అద్భుతమంటూ ప్రజానీకాన్ని మోసం చేశారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆదాయంలో 34% అప్పులకు 35% ఉద్యోగుల జీత భత్యాలకే సరిపోతుందన్నారు. గత ప్రభుత్వం ఇష్టారీతిన అప్పులు తెచ్చి నిధుల దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను ప్రజలంతా అర్థం చేసుకోవాలని తెలిపారు. ప్రజావాణికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని, ప్రతిరోజూ 20 వేల దరఖాస్తులు ప్రభుత్వానికి అందుతున్నాయని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో జరిగిన అన్ని అవకతవకలపై ప్రభుత్వం విచారణ చేపడుతుందని, బాధ్యులైన ప్రజాప్రతినిధులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దిరెడ్డి రాజా, కౌన్సిలర్లు షఫీఉల్ల, వెలుగు వెంకన్న, నాయకులు గోదాల రంగారెడ్డి, స్వామి నాయుడు, నేరెళ్ల మధు, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పటేల్ రమేష్ రెడ్డి

అయ్యప్ప మహాపడిపూజ

పెన్‌పహాడ్: అయ్యప్ప మాలధారణతో ఆత్మ పరిశీలన శక్తి, అపూర్వమైన ఆధ్యాత్మిక ఆనందం లభిస్తుందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం అనంతారంలోని కొడిదల రాంబాబు నివాసంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అయ్యప్ప నామస్మరణ, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వేణారెడ్డి, గజ్జెల సైదిరెడ్డి, మల్గిరెడ్డి సంజీవరెడ్డి, బైరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహా పడిపూజలో పాల్గొన్న ఆర్డీఆర్

ఎమ్మార్సీలకు కొత్తగా కంప్యూటర్లు, ప్రింటర్లు


అర్వపల్లిలోని ఎమ్మార్సీకి వచ్చిన కంప్యూటర్లు

అర్వపల్లి : తుంగతుర్తి నియోజకవర్గంలోని జాజిరెడ్డిగూడెం, తిరుమలగిరి, తుంగతుర్తి, నూతనకల్ ఉమ్మడి మండల ఎమ్మార్సీలకు ప్రభుత్వం నుంచి కొత్తగా కంప్యూటర్లు, ప్రింటర్లు వచ్చాయి. ఒక్కో ఎమ్మార్సీకి 6 కంప్యూటర్లు, ఒక ప్రింటర్, 2 కేవీఏ యూపీఎస్, స్విచ్‌బోర్డులు, కేబుల్ వైర్లు, ప్యానెల్ తదితర సామగ్రిని పంపారు. ఇప్పటికే ఎమ్మార్సీలలో ప్యానెల్‌లను బిగించారు. కంప్యూటర్లను బిగించి ఇన్‌స్టాల్ చేసి అందుబాటులోకి తేనున్నారు. కాగా క్షేత్రస్థాయి నుంచి వివరాలు వేగంగా ఆన్‌లైన్‌లో నమోదుచేయడం, ఇతర విద్యాశాఖ పనులకు గాను సమగ్రశిక్షా అభియాన్ ద్వారా కంప్యూటర్లు వచ్చాయని ఎంఈఓ బి.బాలునాయక్ తెలిపారు.

శ్రీనివాస్ మృతి తీరని లోటు

పెన్‌పహాడ్ : అనంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొన్నె శ్రీనివాస్(51) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, గజ్జెల సైదిరెడ్డి, మాజీ సర్పంచ్ జానిమియా, కొన్నె జానయ్య, జానకిరాములు, రాంరెడ్డి పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామానికి చెందిన కొండమీది వెంకన్న పూరి గుడిసె శనివారం రాత్రి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఫైరింజన్ సిబ్బంది, చుట్టు పక్కల వారు మంటలను ఆర్పారు.